




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 10వ భాగం

1872 మొదట్లో మార్క్స్ రాజకీయ కలాపాలూ, రచనల్లో ముఖ్యంగా కేపిటల్ గ్రంథం ప్రాచుర్యం లోకి వచ్చిన సందర్భం గురించి తెలుసుకుందాం. అప్పటికి ఒక సంవత్సరం ముందు పారిస్ లో సివిల్ వార్ జరిగిందని తెలుసుకున్నాం కదా! ఆ సందర్భంలో మార్క్స్ పేరు బయటకు వచ్చింది. విప్లవ సిద్ధాంత కర్తగా, ప్రణాళికా వ్యూహ రచయితగా అందరికీ బాగా తెలిశాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆయన రచనలకు గిరాకీ పెరిగింది.అక్కడ జర్మనీలో నాలుగేళ్ళ క్రితం విడుదలైన కేపిటల్-1 కూడా ఈ సందర్భంలో అమ్ముడైపోయాయి."మళ్ళీ రీప్రింట్ చేస్తానని" పబ్లిషరు కబురు పంపించాడు. దానికి మార్క్స్ "తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా ఇంకా కొన్ని మార్పులూ, చేర్పులూ చెయ్యాలి. యధాతథంగా దాన్ని రీప్రింట్ చేయవద్దు. మీరు కొన్నాళ్ళు ఆగండి. నేను ఆ మార్పులు చేసి ఇస్తాను." అని చెప్పాడు.

అదలా వుండగా కేపిటల్-1 ఫ్రెంచ్ భాష లోకి అనువాదం ముమ్మరంగా సాగుతోంది. దానికి సంబంధించిన పనులు, అంటే, ఆ ప్రతులు చూడడం, అనువాదం సరిగ్గా ఉందో లేదో చూసుకోవడం లాంటి పనుల్లో మార్క్స్ తీరిక లేకుండా వున్నాడు.

మార్క్స్, ఎంగెల్సులు గతంలో ఎప్పుడో రాసిన "'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' కి సరికొత్త ఉపోద్ఘాతం తో ఫ్రెంచ్, ఇంగ్లీష్ అనువాదం చేద్దాము "అని ఎంగెల్సు సూచించాడు. ఆ కార్యక్రమం కూడా మొదలయ్యింది. ఇవన్నీ ఇలా వుండగా రష్యన్ భాషలోకి కేపిటల్-1 అనువాదం అవుతోందని అనుకున్నాం కదా! అది ఆ భాషలో పూర్తయి, ప్రచురించే దశకూడా వెళ్ళింది. అప్పట్లో ఎలా ఉండేదంటే, రష్యాలో ఏ పుస్తకం ప్రచురించాలన్నా ముందుగా సెన్సార్ వుండేది. అప్పట్లో వున్న రష్యన్ ప్రభుత్వం దృష్టికి కేపిటల్-1 కూడా వెళ్ళింది. ఆ సెన్సార్ అధికారులు చూశారు. చదివారు. కానీ, వాళ్లకు ఏమీ అర్థం కాలేదు. "సరే! ఈ పుస్తకం ఏమీ ప్రమాదకారి కాదు.అసలు దీన్ని ఎవరు చదువుతార్లే" అనుకొని, పెద్దగా ఇబ్బంది పెట్టకుండా అనుమతి ఇచ్చారు.

అయితే, ఒక్క నిబంధన పెట్టారు. "కేపిటల్-1 పుస్తకం రష్యన్ అనువాదం అట్టమీద వున్న కార్ల్ మార్క్స్ బొమ్మ మాత్రం తీసేయ్యమన్నారు. ఎందుకంటే, అది వ్యక్తిగత ప్రచారానికి దారి తీస్తుంది." అన్నారు. అలాగే పబ్లిషరు ఆ బొమ్మ తీసేసాడు. మరి ఎందుకు ఆ పబ్లిషర్ కి అంత నమ్మకం వచ్చిందో గానీ, మొట్టమొదట సారే 3 వేల కాపీలు ప్రింట్ చేశాడు. ఆ కాపీలు 1872 మార్చి చివరిలో రష్యా మార్కెట్ లోకి విడుదలయ్యాయి. అప్పుడు ఉన్నటువంటి రాజకీయ పరిస్థితుల్లో రష్యన్ యువతను ఆ పుస్తకం విపరీతంగా ఆకర్షించింది. ఊహించిన దానికంటే, చాలా వేగంగా కాపీలన్నీ అమ్ముడుపోయాయి. మార్క్స్ కి చాలా ఆశ్చర్యం వేసింది - "ఇదేమిటి? జర్మనీలో మొదటిసారి వెయ్యి కాపీలు అమ్ముడవ్వడానికి 4 ఏళ్ళు పట్టింది. రష్యన్ భాషలో 3 వేల కాపీలు ఇంత వేగంగా అమ్ముడై పోయాయి.!!" అని.

ఈ మొత్తం జరిగిన దాంట్లో చాలా బాగా ఆనందించింది మార్క్స్ భార్య జెన్నీ."భర్త మేధస్సు ప్రపంచం ఎప్పుడు గుర్తిస్తుంది? అసలు అటువంటి రోజు వస్తుందా, రాదా?" అని ఆమె దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నటువంటి రోజులు. ఆమె కలలు నిజమైనటు వంటి రోజులు. ఇది 1872మొదట్లో మార్క్స్ రాజకీయ జీవితానికి సంబంధించిన సంఘటన.

ఇక ఈ సంవత్సరంలో మార్క్స్ ముగ్గురు కుమార్తెల జీవితాలు ఎలా వున్నాయో చూద్దాం. ముందుగా పెద్దమ్మాయి జెన్. ఈమె గురించి తెలుసుకోవడానికి ఒక అబ్బాయిని గురించి తెలుసుకోవాలి. అతని పేరు "చార్లెస్ లాంగెట్" ఈ అబ్బాయి మార్క్స్ రెండో అల్లుడు పాల్ తో కలసి గతంలో మార్క్స్ ఇంటికి వచ్చేవాడని తెలుసుకున్నాం. అప్పుడే జెన్నీచెన్ ఇష్ట పడింది కూడా. కానీ, అప్పుడు చెప్పలేదు. ఇప్పుడు పారిస్ కమ్యూన్ లో జరిగిన సంఘటనల్లో పారిస్ నుండి పారిపోయి, లండన్ వచ్చి,తరచూ మార్క్స్ ఇంటికి వస్తుండేవాడు.

గతంలోనే ఆ అబ్బాయంటే జెన్నీచెన్ కు ఇష్టం వుంది కాబట్టి, ఇద్దరూ మాట్లాడుకుని, ఒకరోజు ఈ విషయం మార్క్స్, జెన్నీలకు చెప్పారు. ఇది 1872 మొదట్లోనే జరిగింది. అయితే, మార్క్స్, జెన్నీ లకు మొదటి నుండీ కూడా రాజకీయాల్లో తిరిగే వాళ్లకు ఇచ్చే ఉద్దేశ్యం లేదు. రెండో అమ్మాయి లారాని, పాల్ కి ఎందుకు ఇచ్చారంటే, అతడు అప్పట్లో "మెడిసన్ చదువుకొని అవుతాను" అంటేనే, పెళ్లి చేశారు.అయితే, ఆ తరువాత రాజకీయాల్లో కొనసాగాడు. వాళ్ళ జీవితం ఎలాగూ సుఖంగా లేదు. ఇదిగో ఈ పెద్దమ్మాయిని కూడా రాజకీయాలే జీవితంగా కొనసాగేవాడికి ఇవ్వడం ఇష్టం లేదు. చెన్ కి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు.

కాకపోతే, అప్పటికే చెన్ వయసు 28 సంవత్సరాలు దాటింది. ఆ అమ్మాయంటే మార్క్స్ కి విపరీతమైన ప్రేమ. మార్క్స్, జెన్ కు నచ్చజెప్పడానికి ప్రయత్నించి నప్పటికీ, కూతురే తిరిగి నచ్చ జెప్పడానికి ప్రయత్నించింది. చివరకు ఎలాగైతేనేం, చెన్ కోరిక నెరవేర్చడానికే నిర్ణయించుకున్నారు. అయితే ఆ సమయానికి రెండో అమ్మాయీ, అల్లుడూ స్పెయిన్ లో వున్నారు. వాళ్ళు కూడా వచ్చాక, 2,3 నెలలు ఆగి, పెళ్లి 1872 జూలై ప్రాంతాలలో చేద్దామని అనుకున్నారు. ఇది పెద్దమ్మాయి సంగతి.

ఇక రెండో అమ్మాయి లారా, పాల్ లు. వీళ్ళకి ముగ్గురు పిల్లలు పుడితే, ఇద్దరు చనిపోయారు. వాళ్ళు స్పెయిన్ దగ్గర్లో వున్నారని అనుకున్నాం. అక్కడ ఉండడానికి పెద్దగా ఇబ్బంది లేదు. మిత్రులు వున్నారు. పాల్ కి ఇంటి దగ్గర నుండి డబ్బులు వస్తున్నాయి.కాబట్టి, ఆయన జీవితం బాగానే వుంది. అయితే, మార్క్స్, ఎంగెల్సులు పాల్ కి సందేశాలు పంపించడం మొదలుపెట్టారు.

"i.w.m.a సంస్థ బ్రాంచిని స్పెయిన్ లో మొదలు పెట్టి, అక్కడ కార్య కర్తలను చేర్చుకో. అలాగే, కేపిటల్-1 స్పానిష్ భాషలో ఎవరైనా అనువాదం చేస్తారేమో కనుక్కో"మని. ఇలా కొన్ని పనులు అప్పజెప్పారు అల్లుడికి. పాల్ ఆ పనులన్నిటిలోనూ తిరుగుతుండేవాడు. ఇంట్లో లారా, అనారోగ్యంతో బాబు ఎలా వున్నాడనే విషయం పెద్దగా పట్టించుకునేవాడు కాదు. పది నెలలుగా బాధ పడుతున్న ఆ అబ్బాయికి చివరికి అది 'కలరా' అని తెలిసింది. కలరా అని గుర్తించిన కొద్ది వారాల్లోనే ఆ బాబు మరణించాడు. లారా పరిస్థితి ఒక్కసారిగా కూకటి వేళ్ళతో పెకిలించిన చెట్టులాగా అయిపోయింది. పది నెలల బాబుని కంటికి రెప్పలా చూసుకున్నప్పటికీ లాభం లేకపోయింది. చివరికి మూడవ సంతానాన్ని కూడా కోల్పోయింది. అప్పటికి ఆమె వయసు కేవలం 26 సంవత్సరాలు మాత్రమే. పెళ్ళయిన నాలుగేళ్ళలో ముగ్గురు పిల్లలకు తల్లయింది. అందరినీ కోల్పోయి, పిల్లలు లేని తల్లిగా మిగిలిపోయింది. పారిస్ లో మూడు నెలల

పాపను సమాధి చేశారు. ఆ తరువాత తాత్కాలికంగా వున్నటువంటి 'లంచన్' గ్రామంలో నాలుగు నెలల బాబుని సమాధి చేశారు. ఇదిగో ఇప్పుడు స్పెయిన్ లోని 'మెండ్రిడ్'లో నాలుగేళ్ల బాబుని సమాధి చేశారు.

'ఇదేనా జీవితం? ఎవరు దీనికి కారణం? తనను పెంచి పెద్ద చేసిన తండ్రా? తన కుటుంబానికి అండగా వున్న అంకుల్ ఎంగెల్సా? ప్రేమించి పెళ్ళిచేసుకున్న పాలా? వీళ్ళ అందరివీ రాజకీయజీవితాలు. మరి భార్యా, పిల్లల భాద్యత లేదా? వాళ్ళు ఏమైపోయినా పట్టదా? అప్పుడు తల్లి జెన్నీ విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఇప్పుడు తనకీ ఇలాగే జరుగుతోంది. అప్పుడైతే తండ్రి తెచ్చిపెట్టిన పేదరికం వలన ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు భర్త ధనవంతుడే. డబ్బులకేమీ ఇబ్బంది లేదు. కాకపోతే ఇప్పుడు కరువైనదల్లా భర్త సమయమే.' ఇలా కొనసాగేయి లారా ఆలోచనలు బిడ్డ చనిపోవడంతో.

17 సంవత్సరాల వయసు లోనే ఎంతో మంది ప్రేమిస్తున్నామంటూ తిరిగిన లారా సౌందర్యం, పెళ్ళయిన 4 ఏళ్ళకే శరీరం అంతా శుష్కించి పోయి, అందం అంతా హరించుకుపోయి జీవచ్ఛవం లాగ మిగిలిపోయింది, మగవాళ్ళ రాజకీయ జీవితాల కోసం, తానూ, తన తల్లీ జెన్నీ కూడా. పెద్ద మనవడు చనిపోయాడనీ, మార్క్సు, జెన్నీలకు తెలిసింది.

"ఇక అక్కడ వుండి ఇబ్బందులు పడడం ఎందుకు? లండన్ వచ్చేయండి.ఇక్కడే ఏమైనా చేసుకోవచ్చు."అని లారా, పాల్ లకు కబురు పంపించారు.వాళ్ళు 1872 మధ్యలో లండన్ వచ్చేశారు.

ఇక మూడో అమ్మాయి 'ఎలినార్'. మార్క్సు ఇంటికి అనేక మంది కార్యకర్తలు వస్తుండేవారు కదా! అందులో ఒక కుర్రాడు ఉన్నాడు. ఇతను కూడా పారిస్ నుండి పారిపోయి వచ్చిన కుర్రాడే. అతని పేరు "ఆలివర్ లిసాగ్రే " వయసు చార్లెస్, పాల్ ల కంటే పెద్దవాడు. 34సంవత్సరాలు. చాలా చురుగ్గా ఉండేవాడు. అతను కూడా బాగా ధనవంతుల కుటుంబానికి చెందిన వాడే. కాకపోతే విప్లవ భావాలవల్ల కుటుంబ సభ్యులతో విభేదించి, బయటకు వచ్చేశాడు. ఫ్రాన్సులో వుండగా కొన్నాళ్ళు టీచర్ గా పనిచేశాడు. మరి కొన్నాళ్ళు పత్రికా విలేఖరిగా పని చేశాడు. ఇప్పుడు i.w.m.a. కార్యక్రమాల గురించి, మార్క్సు ఇంటికి వస్తున్నాడు. ఆ వచ్చే క్రమంలో మార్క్సు మూడో కూతురు 'ఎలినార్'తో పరిచయం అయింది. అయితే, ఎలినార్ వయసు కేవలం 17 సంవత్సరాలు మాత్రమే. ఈ లిసాగ్రే పరిచయం అయిన సమయానికి, ఎలినార్ కంటే రెట్టింపు వయసు. ఆ సమయానికి ఒకరినొకరు ఇష్టపడ్డారు. పెద్దవాళ్ళకు ఈ విషయం తెలియదు. 1872 మధ్యలో తలిదండ్రులకు తెలియకుండా రహస్యంగా నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. అయితే, లిసాగ్రే, ఎలినార్ ల నిశ్చితార్థం తరవాత మరో 8 సంవత్సరం వరకూ జరిగినా గానీ, వివాహబంధంగా మారకపోవడం, ఆమె జీవితాంతం అవివాహితగానే వుండి పోవడం అదంతా తరువాత కథ. ఇదంతా 1872లో మార్క్సు కుటుంబ జీవితంలోని విశేషాలు.

ఇప్పుడు మార్క్స్ రాజకీయ జీవితంలో జరిగిన ఒక ముఖ్యమైన సంఘటన గురించి తెలుసుకుందాం. మార్క్స్ గత 7,8 సంవత్సరముల నుండి i.w. m.a. అనే సంస్థలో చాలా చురుకుగా, ప్రధానమైన పాత్ర పోషిస్తున్నాడు కదా! అందులోనుండి 1872 లోనే బయటకు వచ్చేశాడు. అదెలా జరిగిందంటే..

మార్క్స్ తరచూ అనారోగ్యం బారిన పడుతుండేవాడు. అలాగే కేపిటల్-2 రాత పనిలో వున్నాడు. అంతే కాకుండా, ఇతర భాషల్లో వచ్చే అనువాదాల్ని సరి చూడడం పనుల్లో తీరిక లేకుండా వున్నాడు. అలాంటి పరిస్థితుల్లో ఈ i.w.m.a. కార్యక్రమాలకే దూరంగా వుండడం మంచిది అనుకొని, ఒక నిర్ణయానికి వచ్చాడు. ...”నాకు చూసుకోవడం కుదరడం లేదు. మీరే చూసుకోండి. “ అని బయటకు వచ్చేయవచ్చు. కానీ, అక్కడ ఒక ఇబ్బంది వచ్చింది. i.w.m.a. సంస్థలో మార్క్స్‌కి వ్యతిరేకమైన వర్గం ఒకటి తయారయ్యింది. వాళ్ళ వాదన ఏమిటంటే?

“హింస ద్వారా, దౌర్జన్యం ద్వారానే మార్పు వస్తుంది.”అని వాళ్ళు నమ్మారు.

“i.w.m.a. ద్వారా చేయదలచుకున్నదంతా చట్టపరమైన పోరాటమే. ఒక వేళ ఆ పోరాటంలో ఎక్కడైనా హింస వస్తే, రావచ్చు. అది తప్పులేదు. కానీ, హింసే పోరాటం కాకూడదు.”అని మార్క్స్ వాదించే వాడు. ఇప్పుడు గనక ఆ సంస్థనుండి బయటకు వచ్చేస్తే,అది ఖచ్చితంగా వ్యతిరేక వర్గం చేతిలోకి పోతుంది. అది హింసాత్మక సంస్థగా అయిపోతుంది. ఆ ప్రమాదం నుండి తప్పించడానికి మార్క్స్, ఎంగెల్సులు ఒక పథకం వేశారు.

1872 సెప్టెంబర్ మొదటి వారంలో నెదర్లాండ్స్ లో జరిగిన ఆ సంస్థ అంతర్జాతీయ సదస్సులో ఒక తీర్మానం చేశారు. అదేమిటంటే, ‘ఆ సంస్థ యొక్క కేంద్ర స్థానాన్ని లండన్ నుండి అమెరికాలోని న్యూయార్క్ తరలించడం’ ఆ ప్రతిపాదనకు అందరూ ఒప్పుకున్నారు. దాంతోటి i.w.m.a. సెంటర్ కౌన్సిల్ అమెరికాకు వెళ్ళింది. అయితే, కాలక్రమేణా బలహీన పడి, చరిత్రలో కలిసిపోయింది. అదంతా వేరే చరిత్ర. ఈ సంఘటన ఇంత ఎందుకు ప్రస్తావించు కున్నామంటే, ఈ i.w.m.a.నుండి బయటకు రావడం అనేది మార్క్స్ జీవితంలో ఒక గొప్ప మార్పు. ఇక అక్కడ నుండి మార్క్స్ జీవితంలో నుండి ఆ సంస్థ పూర్తిగా మాయం అయిపోయింది. అందువల్ల మార్క్స్‌కి జరిగినటువంటి మేలు ఏమిటంటే, ఆయన వ్యక్తిగత జీవితంలో పూర్తి సమయాన్ని కేపిటల్ రచనకు కావలిసిన సమాచారాన్ని సేకరించడం,వాటికి సమయాన్ని కేటాయించడానికి వీలయ్యింది.ఇదంతా 1872 లోనే.

ఇప్పుడు 1872 నుండి 1875 జరిగిన పరిణామాలు చూద్దాం. ముందుగా కూతుర్ల విషయాలు. పెద్దమ్మాయికి చెన్‌కి పెళ్లి చేద్దామనే ప్రయత్నాల్లో వున్నారు. చెన్, చార్లెస్ ల వివాహం 1872 అక్టోబర్ 9న జరిగింది. అంతకు 4 ఏళ్ళ ముందు రెండో అమ్మాయి వివాహం ఏ రిజిస్ట్రార్ ఆఫీసులో జరిగిందో, అక్కడే వీళ్ళ వివాహం కూడా రిజిస్టర్ చేశారు. ఈ పెళ్లికి కూడా ఎక్కువ మంది వెళ్ళలేదు. పైగా ఎందుకో గానీ, అందరూ కూడా అంత ఉత్సాహంగా ఏమీ వున్నట్టు లేదు. అప్పటికి చెన్ వయసు 28, చార్లెస్ వయసు 33.పెళ్లి చాలా నిర్లిప్తంగా జరిగిపోయింది.

పెళ్ళవగానే లండన్ కు కాస్త దూరంగా ఉన్నటువంటి ఆక్స్ ఫర్డ్ కి చార్లెస్, చెన్ వెళ్లి కాపరం పెట్టారు. అక్కడకు ఎందుకు వెళ్ళారంటే, చార్లెస్ కు అక్కడ ఒక స్కూల్లో ఫ్రెంచ్ క్లాసులు చెప్పే అవకాశం వచ్చింది. అయితే, ఆ వుద్యోగం వచ్చిన 1,2 వారాల్లోనే పోయింది. ఎందుకు పోయిందంటే, ఆ స్కూలుకి వెళ్లి, ఫ్రెంచి క్లాసులు చెప్పడం మొదలు పెట్టగానే, చార్లెస్ కి కమ్యునిస్ట్ కార్మిక సంఘాలతో సంబంధం ఉందనీ, i.w.m.a. సంస్థలో క్రియాశీలకంగా ఉండేవాడని, ఆ యాజమాన్యానికి తెలిసింది. అంతే కాకుండా కొంతమంది విద్యార్థులు, ఆయన దగ్గర చదువుకోవడానికి వ్యతిరేకించారు."ఈ ఒకప్పటి కమ్యునిస్ట్ నాయకుడి దగ్గర మేం చదువుకోము" అన్నారు. దాంతో స్కూలు యాజమాన్యం, చార్లెస్ ఉద్యోగానికి ఉద్వాసన చెప్పింది. ఈ విషయాలన్నీ మార్క్సుకు తెలిశాయి.

"సరే !వుద్యోగం లేకుండా అక్కడేం చేస్తారు.ఇంటికి వచ్చేసెయ్యండి."అని, పెద్దకూతుర్నీ, అల్లుడ్నీ కాపురం పెట్టిన నెల రోజులు దాటక ముందే మళ్ళీ లండన్ తీసుకు వచ్చేసాడు. అప్పటికే, లారా, పాల్ కూడా ఇంట్లోనే వున్నారు. మూడవ అమ్మాయి ఎలాగూ ఇంట్లోనే వుంది. మళ్ళీ 5,6 సంవత్సరాల తర్వాత ఇల్లంతా నిండుగా వుంది.

చెన్ జీవితం ఎలా కొనసాగిందంటే...ఈ పెద్దల్లుడు చార్లెస్ వుద్యోగం వెతుక్కోవడం లో చాలా బద్ధకంగా ఉండేవాడు. అత్తగారు జెన్నీ అంటుండేది "మీరు ఆలస్యం చేస్తున్నారు.త్వరగా వుద్యోగం వెతుక్కోండి."అని. అయితే, వుద్యోగం దొరక్క పోవడానికి మరొక కారణం కూడా వుంది. అప్పటికే లండన్ లోనూ, లండన్ చుట్టుపక్కల వూర్ల నిండా ఫ్రాన్సు నుండి వచ్చిన వాళ్ళు చాలా మంది వున్నారు. వాళ్ళందరూ కూడా "ఫ్రెంచి చెబుతాం" అనేవాళ్ళే. అందుకని చార్లెస్ కి వుద్యోగవకాశాలు సన్నగిల్లాయి. ఆ పరిస్థితి లో చెన్ మళ్ళీ ఇంటింటికీ వెళ్లి ట్యూషన్లు చెప్పడం మొదలు పెట్టింది. అంతకు ముందు ఎలాగూ ట్యూషన్లు చెప్పే అలవాటు వుంది కదా! ఒక మాదిరిగా సంపాదన మొదలు కాగానే మార్క్స్ కు ఇంటికి దగ్గరలోనే, ఒకచిన్న పోర్షను అద్దెకు తీసుకొని, అందులోకి వెళ్లారు చార్లెస్, చెన్ లు.

వాళ్లకు 1873 సెప్టెంబర్ 3 న అంటే, వివాహం అయిన ఒక ఏడాదికి ఒక బాబు పుట్టాడు. వాళ్ళ ఆర్థిక స్థితి ఏమంత బాగుండలేదు. చెన్ ట్యూషన్లు చెబుతోంది. చార్లెస్ వుద్యోగం లేకుండా వున్నాడు. జాగ్రత్త గా గమనిస్తే, 1844 నుండి మార్క్సుసంతానం గానీ,1868 నుండి జన్మించిన సంతానం గానీ, ఎవ్వరూ కూడా సౌకర్యవంతమైన, సుఖవంతమైన వాతావరణం లో జన్మించలేదు. ఇదిగో ఈ చెన్ సంతానం కూడా ఇబ్బందుల్లో నే పుట్టాడు. కాకపోతే మనవడ్ని చూడగానే మార్క్సు ఆనందానికి అంతు లేదు. ఆ రెండో అమ్మాయి ముగ్గురి సంతానాన్ని చూడలేకపోయాడు. వాళ్ళు దూరంగా మరణించారు.

ఈ కుర్రవాడి సమక్షంలో మార్క్సు, జెన్నీలు చాలా ఆనందంగా వుండేవారు. అదలా వుంటే, చెన్ ట్యూషన్లు చెబుతున్నది అనుకున్నాం కదా! ఉదయం, సాయంత్రం ట్యూషన్లు చెప్పడం, పసి బిడ్డ పోషణలో తీరిక లేకుండా వుండడం ఇలా ఇన్ని ఇబ్బందులు ఎదురయ్యేసరికి చెన్ ఆరోగ్యం, తద్వారా నెలల బాబు ఆరోగ్యం కూడా దెబ్బతిన్నాయి. మార్క్సు

కుటుంబాన్ని ఒకప్పుడు వెంటాడిన దురదృష్టం ఇప్పుడు చెన్ ని కూడా వదల్లేదు. పుట్టిన ఒక సంవత్సరం లోపే 1874 ఆగస్టు లోనే చెన్ మగ బిడ్డ కన్నుమూశాడు. ఈ సంఘటన ఆ బిడ్డ మరణం, చార్లెస్, చెన్ లనే కాదు, మార్క్స్ ని కూడా విపరీతంగా క్రుంగ దీసింది.

మర్క్సకి యెంత అనారోగ్యంగా వున్నా, యెంత తీరిక లేకుండా వున్నా మనవడు దగ్గర వుంటే అన్నీ మరచిపోయేవాడు. వాళ్లకి గతం గుర్తుకు వచ్చింది. లండన్ వచ్చిన కొత్తలో పిల్లలు పుట్టగానే చనిపోవడమో, పుట్టిన కొన్ని నెలలకి చనిపోవడమో జరిగింది. అలాంటి  దృశ్యాలే మళ్ళీ పునరావృతం అవుతున్నట్లనిపించింది. 1874 చివర్లో పెద్దల్లుడు చార్లెస్ కి కాస్త స్థిరమైన వుద్యోగం దొరికింది. లండన్ లోనే,'కింగ్స్ కాలేజీ'లో ఫ్రెంచి బోధించే ప్రొఫెసర్ గా దొరికింది. నెమ్మదిగా చెన్ ట్యూషన్లు చెప్పడం తగ్గించింది. మరీ వాళ్లకు అత్యవసరం అయినప్పుడు ఎంగెల్సు సహాయం అందుతుండేది. అలాగే చార్లెస్ తల్లి కూడా కొంత పంపిస్తుండేది.1875 వచ్చేసరికి చార్లెస్, చెన్ లు కొడుకు పోయిన విషాదం నుండి కోలుకుంటూ కొత్త జీవితాన్ని ప్రారంభించారు.

ఇక రెండో అమ్మాయి.లారా, పాల్ లు స్పెయిన్ నుండి వచ్చారు కదా! వాళ్ళ జీవితాలు ఎలా వున్నాయో చూద్దాం.వాళ్ళు స్పెయిన్ నుండి రాగానే, మార్క్స్ ఇంట్లోనే వుండేవారు.  పాల్ స్పెయిన్ లో ఉండగా, వాళ్ళ అమ్మ దగ్గరనుండి వచ్చిన డబ్బులూ, తండ్రి ఇచ్చిన డబ్బులూ అన్నీ కూడా అక్కడే ఖర్చు పెట్టేశాడు. అందుకని, లండన్ వచ్చేసరికి వీళ్లలాగే ఆర్ధిక ఇబ్బందుల్లో వున్నారు. కావాలంటే, అంతకుముందు లండన్ లో పూర్తి చేసిన మెడిసన్ కోర్సులతో డాక్టర్ గా ప్రాక్టీస్ చేయవచ్చు. ఆయనకు ఆ అవకాశం వుంది. కాకపోతే "నా ముగ్గురి సంతానంలో ఏ ఒక్కరినీ కాపాడలేక పోయిన వైద్య వృత్తి నాకు వద్దు" అని దాని మీద అలిగి ఆయన మెడికల్ ప్రాక్టీస్ వైపు వెళ్ళడానికి ఇష్ట పడలేదు. అదీకాక ఏదైనా వ్యాపారం చేస్తానని మార్క్స్ తో చెప్పాడు.

మార్క్స్ కొంతమంది సోషలిస్ట్ మిత్రులు వుంటే, వాళ్లకు పరిచయం చేశాడు పాల్ ని. రెండు,మూడు వ్యాపారాలలో పెట్టుబడి పెట్టి చేతులు కాల్చుకున్నాడు. మళ్ళీ ఆ కష్టాల నుండి బయటకు రావడానికి ఎంగెల్సే సహాయం చెయ్యాల్సి వచ్చింది. దాదాపుగా మార్క్సకే కాకుండా, వాళ్ళ పిల్లలకు కూడా ఏ ఇబ్బందులు వచ్చినా గానీ, ఎంగెల్సే సహాయం చేస్తుండేవాడు. చివరకు ఆ వ్యాపారాలు అన్ని దెబ్బతిని, తన ఇంట్లోనే "ఫోటో లితో గ్రాఫిక్ & ఎచింగ్"అనే ఒక చిన్న కుటీర పరిశ్రమ లాంటిది 'కిచెన్'లో పెట్టుకున్నాడు. కుటుంబం గడవడానికి లారా కూడా ట్యూషన్లు చెప్పడం ప్రారంభించింది. ఇలా ఏదో వున్నంతలో స్థిర పడ్డాక, మార్క్సకి ఇంటికి దగ్గరలోనే ఒక ఇల్లు చూసుకొని, అందులోకి మారారు.

ఇక మూడో అమ్మాయి ఎలినార్. ఈ ఎలినార్, ఆలివర్ లిసాగ్రే అనే వ్యక్తితో రహస్యంగా నిశ్చితార్ధం అయిందని అనుకున్నాం కదా! కొన్నాళ్ళకు మార్క్సు, జెన్నీలకు ఆ విషయం తెలిసింది. ఎలినార్ ను పిలిచి చెప్పారు "అమ్మా! నీదింకా చిన్న వయసు. వివాహం గురించి నిర్ణయం తీసుకునేటంతటి పరిణితి లేదు. వయసులో ఇంత వ్యత్యాసం వుంటే వచ్చే సమస్యలు మాకు తెలుసు. ఈ ఆలోచన మానుకో.పైగా రాజకీయాల్లో వుండీ, నేనూ, మీ బావలూ ఎన్ని ఇబ్బందులు పడుతున్నమో చూస్తున్నావు కదా! మళ్ళీ రాజకీయాల్లో తిరిగే వాడితో మేం పెళ్ళికి అంగీకరించం."అని చెప్పేశారు. తలిదండ్రులను కాదనే, స్వతంత్రత లేదు ఎలినార్ కి. అలాగని ఆ లిసాగ్రేతో రాజీ పడలేదు. ఇలా కాదు. 'నా అంతట నేనే ఏదైనా వుద్యోగం చేసుకుంటే,తర్వాత తల్లి దండ్రులను ఒప్పించ వచ్చు.' అనుకొని లండన్ కి దగ్గరలోనే "బ్రయిటన్" అనే వూరుంటే, అక్కడకి వెళ్లి టీచర్ గా వుద్యోగం చూసుకుంది. ఈ లిసాగ్రే అప్పుడప్పుడు అక్కడకు వెళ్లి కలుస్తుండేవాడు. 1872నుండి 75వరకూ మార్క్సు కూతుర్ల గురించిన విశేషాలు ఇవి.

అయితే, ఈ మధ్యలో మార్క్సు జీవితంలో జరిగిన ఒక సంఘటన గురించి తెలుసుకుందాం. 1873నుండి 74 మధ్య రష్యాలో కేపిటల్ పుస్తకం మూడు వేల కాపీలు ఎక్కడైతే అమ్ముడయ్యాయో, అక్కడ కొంతమంది విద్యార్ధులూ, సోషలిస్టులూ, మరి కొంత మంది కలసి ప్రభుత్వం మీద తిరుగుబాటు చేశారు. వాళ్ళు ఎందుకంతగా తిరుగుబాటు చేశారు? వీళ్ళకి ఇంత చైతన్యం ఎలా వచ్చింది? అని అక్కడ వున్న అధికారులు పరిశోధించడం మొదలుపెడితే, తెలిసింది ఏమిటంటే,"వీళ్ళందరూ కూడా కేపిటల్ పుస్తకం చదివారు. అందుకని వీళ్ళు అలాంటి విప్లవం ఏదో తీసుకువద్దామని తిరుగుబాటు చేశారు."అని వాళ్లకు తెలిసింది.

అదే రోజుల్లో "వియన్నా"లో ఒక వ్యక్తి మార్క్సు ఫోటోను జేబులో పెట్టుకొని తిరుగుతున్నాడని చెప్పి, జైల్లో పెట్టారు. ఇదిగో ఇలాంటి వన్నీ, యూరప్ దేశాల్లో జరగడం గమనించిన మార్క్సు తన మీద బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఏదైనా చర్య తీసుకుంటుందేమోనని, భద్రత కోసమని 'బ్రిటీష్ పౌరసత్వం'కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటికి ఆయన ఇంగ్లాడు వచ్చి 25 ఏళ్ళు అవుతోంది.

మార్క్సు దరఖాస్తు అందుకుని, బేక్ గ్రౌండ్ అంతా చెక్ చేశారు. వాళ్ళు దర్యాప్తు చేసిన మీదట ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఏం చెప్పారంటే..."ఇతను నోటోరియస్ జర్మన్ యాజిటేటర్..అడ్వకేట్ ఆఫ్ కమ్యూనిస్ట్ ప్రిన్సిపాల్స్" బ్రిటీష్ రాచరికం పట్ల ఏమాత్రం గౌరవం లేదు. అందుచేత బ్రిటీష్ పౌరసత్వం ఇవ్వవద్దు "అని గట్టిగా తేల్చి చెప్పారు. ఆ తర్వాత 1883 లో మార్క్సు మరణించేవరకు, ఏ దేశానికీ చెందని పౌరుడి లాగా, అంటే సమస్త ప్రపంచానికీ చెందిన పౌరుడు అనుకోవచ్చు. అలా లండన్ లోనే కొనసాగాడు.

మార్క్స్ ముగ్గురు పిల్లలూ బయటకు వెళ్ళిపోయాక, అంత పెద్ద ఇల్లు ఎందుకులే అనుకొని, అక్కడకు దగ్గర్లోనే మరో ఇంటికి మారారు. ఇది కూడా ఒక మోస్తరు గా వుంటుంది. మరీ అంత చిన్న ఇల్లేమీ కాదు. ఎంగెల్సు డబ్బులు ఇస్తున్నాడు కదా! అందుకని డబ్బులకు పెద్దగా ఇబ్బందేమీ లేదు. మార్క్స్, జెన్నీల జీవితంలో చిట్టచివరి ఇల్లు ఇదే. వాళ్ళ చివరి రోజులు ఈ ఇంట్లోనే, ఇక్కడ నుండే నిష్క్రమించారు. మార్క్స్ కి అనారోగ్యం తిరగబెట్టి నప్పుడల్లా సముద్రతీర గ్రామానికి వెళ్లి, వైద్యం చేయించుకునేవాడు. ఇలా 1875 గడచింది. ఇక్కడ నుండి 78 వరకూ జరిగిన కొన్ని సంఘటనలు.

1876 వచ్చింది. ఆ సంవత్సరం మే పదవ తేదిన చెన్ కి మరో మగ బిడ్డ పుట్టాడు. అంటే, రెండో బిడ్డ. మొదట బిడ్డ చనిపోయాడని అనుకున్నాం కదా! మొదటిసారి పరిస్థితి ఈసారి రాకూడదని మార్క్స్ భార్య జెన్నీ, ఎంగెల్సు భార్య లిజీ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.ఆ పిల్లవాడి పేరు కూడా చార్లెస్ వాళ్ళ నాన్న పేరూ,ఎంగెల్సు పేరూ,పిన్ని లారా పేరూ కలసి వచ్చేలా పెట్టారు. " జీన్ లారెంట్ ఫ్రెడరిక్ లాంగెట్ "అని పెట్టారు. ముద్దుగా "జానీ" అని పిలిచే వాళ్ళు. మార్క్స్ సంతానంలో పెరిగి పెద్దవాడై, ఒక స్థాయికి చేరిన మొట్ట మొదటి వాడు ఈ 'జానీ' యే. 1876 లో పుడితే, ఆయన దాదాపు 62 ఏళ్ళు జీవించి,1935 వరకూ వున్నాడు. ఆ తరువాత రోజుల్లో "సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఫ్రాన్సు" కి నాయకత్వం వహించే స్థాయికి వెళ్ళాడు. ఇన్ని మరణాల తర్వాత మార్క్స్ రెండో తరంలో జీవించిన వాడు ఈ 'జానీ'.

1876 లో మూడవ అమ్మాయి ఎలినార్ ఎలా వుందో చూద్దాం. ఆమె లిసాగ్రే తో ప్రేమలో పడి 4 ఏళ్ళవుతోంది. వాళ్ళ పెళ్ళికి మార్క్స్, జెన్నీలు ఒప్పుకోలేదు. ఈ 4ఏళ్ళలో ఎలినార్ కి కాస్త మానసిక పరిపక్వత వచ్చింది. సహజం గానే ఆమె చుట్టూ, కొత్త మిత్రులు వచ్చారు. ఆమె పనిచేసే స్కూలు యూనియన్ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనేది. అంతే కాకుండా బయట థియేటర్లలో నాటకాల్లో కూడా నటించేది.ఇదంతా జరుగుండేసరికి ఆమెను ఇష్టపడే లిసాగ్రే కి నలభై ఏళ్ళు వచ్చాయి. అతను లండన్ వచ్చి 5 ఏళ్ళు అవుతున్నాగానీ, ఇంగ్లీష్ సరిగ్గా మాట్లాడడం వచ్చేది కాదు. ఫ్రెంచి భాషలో పుస్తకాలు రాస్తుండేవాడు గానీ, వుద్యోగం ఏమీలేదు. క్రమ క్రమంగా వాళ్ళిద్దరి మధ్యా ఉన్నటువంటి బంధం పలుచబడుతూ వచ్చింది. ఇలా 76,77 సంవత్సరాలు గడచిపోయాయి.

1878 లో మార్క్స్ పెద్దమ్మాయి చెన్ మరొక మగ బిడ్డకు జన్మనిచ్చింది. మూడవ బిడ్డ. బ్రతికి వున్నవాళ్లలో రెండవ బిడ్డ. ఈ పిల్లవాడు పుట్టినపుడు బాగానే ఉండేవాడు. కొంచెం ఎదగడం ప్రారంభించాక తెలిసింది. మానసికంగా ఎదగడం లేదని. "హేరీ" అని పేరు పెట్టుకున్న ఆ అబ్బాయి 5 సంవత్సరాలు మాత్రమే జీవించాడు. 1878లోనే మరొక విషాదకరమైన వార్త. ఎంగెల్సు భార్య 'లిజీ' తన 51 ఏళ్ళ వయసులో 1878 సెప్టెంబర్ 12 న చనిపోయింది. ఎంగెల్సు ఒంటరి వాడయ్యాడు. అంతకుముందు కొన్ని సంవత్సరాలు లిజీ అక్కతో ఉండేవాడు. తర్వాత లిజీని భార్యగా

చేసుకున్నాడు. ఇప్పుడు ఏకాకిగా మిగిలిపోయాడు. ఆ విషాదం నుండి నెమ్మది నెమ్మదిగా కోలుకుంటున్నాడు. తర్వాత మార్క్స్‌ను కలసి, కేపిటల్-2 కి సంబంధించిన సమాచారం సేకరించే పనులన్నీ చేస్తుండేవాడు.

మార్క్స్ కూడా తన వ్యక్తిగత జీవితంలో వస్తున్న ఒడిదుడుకులు తట్టుకుంటూ, అలాగే తరచూ వేధిస్తున్న అనారోగ్యం నుంచీ కాపాడుకుంటూ 'కేపిటల్-2' రచనని కొనసాగిస్తున్నాడు. ఈ కేపిటల్-2 ఎప్పుడో పదేళ్ళ క్రితమే పబ్లిషర్ కి ఇస్తానని వాగ్దానం చేసి వున్నాడు. పదేళ్ళయినా ఇంకా నడుస్తూనే వుంది. ఈలోగా జర్మనీ నుండి పబ్లిషర్ వుత్తరం రాశాడు. "జర్మనీలో "యాంటీ సోషలిజం "అనే చట్టాన్ని తీసుకువచ్చారు.అందుకని కేపిటల్-2 ప్రచురణ కాస్త ఆలస్యమవుతుంది." అని. మార్క్స్‌కి కావలిసింది కూడా అదే. ఎలాగూ సిద్ధంగా లేడు.

1879 వచ్చింది. చెన్ కి మరో మగబిడ్డ పుట్టాడు. ఆ అబ్బాయికి 'ఎడ్గర్' అని పేరు పెట్టుకున్నారు.అంటే, ప్రతి ఏడాదీ ఒక్కో సంతానం. 'ఎడ్గర్' పేరు, మార్క్స్ కొడుకు 8 ఏళ్ళ వయసులో చనిపోయిన కొడుకు పేరు.ఈ ఎడ్గరే మార్క్స్ మనవళ్ళలో సుదీర్ఘకాలం జీవించిన వ్యక్తి. 195o వరకూ జీవించాడు. పెరిగి, పెద్దవాడయ్యాక, ఫ్రాన్సులో మెడికల్ డాక్టర్ గా చాలా చక్కని స్థాయిలో స్థిరపడడమే కాకుండా, సోషలిస్ట్ పార్టీ లో చాలా చురుకుగా పాల్గొనేవాడు.

188o వచ్చింది.ఇక్కడ ఒక మార్పు జరిగింది. ఫ్రాన్సులో రిపబ్లికన్ ప్రభుత్వం కొత్తగా వచ్చింది. "ఎప్పుడో 8,9 ఏళ్ళ క్రిందట ఫ్రాన్సు నుండి లండన్ పారిపోయిన వాళ్ళందరికీ కూడా క్షమాభిక్ష పెడతారు " అని వార్త వచ్చింది. అలా క్షమాభిక్ష పెడితే, ఫ్రాన్సు నుండి లండన్ వచ్చిన చాలా మంది మళ్ళీ వెనక్కి వెళ్ళిపోవడానికి సిద్ధంగా వున్నారు. అలా జరిగితే, మార్క్స్ అల్లుళ్ళు కూడా వెళ్ళిపోవడానికి సిద్దంగా వున్నారు. ముఖ్యంగా పెద్దమ్మాయి చెన్ వెళ్ళిపోతుందని ఆందోళన పడ్డారు. ఎందుకంటే, మార్క్స్ జెన్నీలు ఎంత అనారోగ్యంలో వున్నా, ఎన్ని పనుల్లో వున్నా ఆ పిల్లలే ఊరట గా వుండేవాళ్ళు.

వాళ్ళు దిగులు పడిన సమయం రానే వచ్చింది. 188o మధ్యలో "ఫ్రాన్సు నుండి వెళ్ళిపోయిన వాళ్ళు వెనక్కి రావచ్చు. క్షమా బిక్ష పెడతాము " అని ప్రకటన రాగానే చాలామంది వెనక్కి వెళ్ళడం ప్రారంభించారు.మార్క్స్ సంబంధించిన మనుషులు చూసుకుంటే – ముందుగా 'లిసాగ్రే'వెళ్ళిపోయాడు. అతను పారిస్ వెళ్ళిపోయి, తన పాత వృత్తి అయినటు వంటి జర్నలిజంలో స్థిరపడ్డాడు. దాంతోటి ఈ లిసాగ్రే, ఎలినార్ లు పూర్తిగా విడిపోయారు. లిసాగ్రే వెళ్ళిపోవడం తో పెద్దవయసు వాడితో ఎలినార్ పెళ్లి తప్పిపోయిందని, మార్క్స్, జెన్నీలు ఆనందించారు. అయితే, ఎలినార్ పెళ్లి గురించి ఏమీ చెప్పడం లేదు. ఆ దిగులు మాత్రం వుంది.

లిసాగ్రే తర్వాత ఫ్రాన్సు వెళ్ళిపోవడానికి సిద్ధపడింది మార్క్స్ పెద్దల్లుడు చార్లెస్. 188o ఆగస్టులో భార్య చెన్ కి చెప్పాడు "మనం పారిస్ వెళ్ళిపోదాం" అని. చెన్ ఏమిటంటే, ముగ్గురు చిన్న పిల్లలతో సతమతవుతోంది. ఆ సమయంలో మార్క్స్, జెన్నీలకు ఆరోగ్యాలు సరిగ్గా వుండడం లేదు. మార్క్స్ కి ఎప్పుడూ ఉండేదే ఒళ్ళంతా పుళ్ళు. జెన్నీకి కూడా

తీవ్రమైన అనారోగ్యం మొదలయ్యింది. కొన్ని నెలల తర్వాత బహుశా అది 'కేన్సర్ ' అయి ఉంటుందని. "ఆ పరిస్థితిలో అమ్మా, నాన్నలను వదిలివెళ్ళడం అనేది మంచిది కాదు. ముందు మీరు వెళ్ళండి. తర్వాత చూద్దాం "అని చెప్పింది భర్తకు. చార్లెస్ ఒక్కడే ఫ్రాన్సు వెళ్ళాడు. అక్కడే ఒక పత్రికలో జర్నలిస్ట్ గా చేరాడు. అది పెద్ద వుద్యోగం ఏమీ కాదు. రాజకీయాల్లో కూడా తిరుగుతున్నాడు. వాటిని వదిలి పెట్టలేదు. వాళ్ళ అమ్మ ఏం చెప్పిందంటే.."ఒరే అబ్బాయ్! నువ్వు పెద్దవాడివి అయ్యావు. ఇకపై నీ డబ్బులేవో నువ్వు చూసుకో.నేనేమీ సహాయం " అని. ఆ భయంతో, కుటుంబాన్ని పోషించలేనేమో నన్న సంశయంతో చెన్ ని వచ్చేయమని పెద్దగా బలవంతం చేయలేదు.

మార్క్స్ రెండో కూతురు లారా, పాల్ వున్నారు కదా! వాళ్ళు వెంటనే పారిస్ వెళ్ళడానికి నిర్ణయించుకోలేదు. ఎందుకంటే, వాళ్లకి వచ్చే ఆదాయమే అంతంత మాత్రంగా వుంది. ఇప్పుడు మళ్ళీ పారిస్ వెళ్లి స్థిరపడడానికి ఆర్థిక స్థోమత అంతగా లేదు. అందుకని అప్పుడే ఫ్రాన్సు వెళ్దామని అనుకోలేదు.

ఈ పరిణామాలన్నీ జరిగిన తర్వాత, చెన్, భర్త వెళ్ళిన 6,7 నెలలకు ముగ్గురు పిల్లలను తీసుకొని ఫ్రాన్సు వెళ్ళింది. అప్పటికి ఆమె నిండు గర్భిణి. అక్కడ చార్లెస్ ఆర్థిక పరిస్థితి ఏమీ బాగా లేదు. ఒకప్పుడు మార్క్స్ ,జెన్నీలు పేదరికంతో వరసగా పిల్లలు పుట్టడం వలన ఎలా ఇబ్బంది పడ్డారో,సరిగ్గా అలాంటి ఇబ్బందులే ఇప్పుడు చెన్ విషయంలో పునరావృతం అయ్యాయి. ఈ ఇబ్బందుల్లోనే 1881 ఏప్రెల్ లో 5వ సారి తల్లయింది చెన్. అమ్మాయికి అబ్బాయి పుట్టాడన్న శుభవార్త మార్క్స్, జెన్ని లకు తెలిసింది. అయితే, అప్పటికి జెన్ని ఆరోగ్య పరిస్థితి ఇంకా దిగజారింది. రక్తం వాంతులు అవుతున్నాయి. చర్మం మీద పగుళ్ళు వచ్చి, అందులోనుండి రక్తం కూడా వస్తోంది.

రకరకాల డాక్టర్లు, రకరకాల మందులు ఇస్తున్నారు. వాళ్ళు 'కేన్సర్' అని నిర్ధారించారు. మార్క్స్‌కు ఎప్పుడూ ఉండేదే పుళ్ళూ, ఛాతీలో నొప్పి. కాకపోతే వాళ్ళిద్దరికీ మనవడిని చూడాలని వుంది. ఫ్రాన్సులో కొత్త ప్రభుత్వం కాబట్టి, మార్క్స్‌కు ఫ్రాన్సు వెళ్ళడానికి ఏమీ ఇబ్బంది లేదు. ఇద్దరూ నెమ్మదిగా ఓపిక తెచ్చుకొని, హెలెన్ సహాయంతో పెద్దకూతురు చెన్ దగ్గరకు వెళ్లారు. మార్క్స్ 32 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఫ్రాన్సులో అడుగుపెట్టడం.మార్క్స్, జెన్నిలు కొత్త దంపతులుగా వున్నప్పుడు పారిస్ లో వున్నారు. ఇదిగో మళ్ళీ ఈ వృద్ధాప్యంలో కూతుర్ని చూడడానికి వచ్చారు. కూతురి పేదరికాన్ని చూసి చలించిపోయారు. అల్లుడి బాధ్యతారాహిత్యానికి బాధపడ్డారు. జెన్ని ఆరోగ్యం బాగోలేదు కాబట్టి, 3,4 వారాలుండి లండన్ తిరిగి వచ్చేశారు. జెన్ని తన పెద్దకూతురునీ, మనవళ్లనీ చూడడం అదే ఆఖరుసారి అవుతుందని ఆమె ఊహించలేదు.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 డిసెంబర్ 09 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS